కానరాని జలపుష్పాలు!

- కలుషితమవుతున్న జలాలు
- జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులు
- నిరాశలో మాంసాహార ప్రియులు


తూర్పు డెల్టా ప్రధాన పంట కాలువలో చేపలు వేటాడుతున్న మత్స్యకారుడు (ఫైల్)

అలమూరు: మాంసాహార ప్రియులకు చేప రకాల్లో 'పులస' తరువాత అంతటి ప్రాధాన్యం సంతరించుకున్న పలు జాతులకు చెందిన కాలువ చేపలు జాడ కానరావడం లేదు. నిశ్శబ్దంగా ప్రవహించే పంట కాలువల్లో పారే జలాల్లో అత్యధికంగా చేరుతున్న వ్యర్థాల వల్ల సాగునీరు కలుషితం కావడంతో కాలువ చేపలు క్రమేపీ కనుమరుగవుతున్నాయి. గతంలో కాలువలు మూసివేసిన తరువాత అక్కడక్కడ నీరు నిల్వ ఉండే ప్రాంతంలో అధిక సంఖ్యలో లభ్యమయ్యే బొమ్మిడాయిలు, కొరమేనులు, పిత్త పరిగెలు, గొరసలు తదితర కాలువ చేపలు నేడు మచ్చుకైనా కానరావడం లేదు. మత్స్యకారులు వేట కొనసాగించినా చేపలు లభ్యత అంతంత మాత్రంగానే ఉండటంతో జీవనోపాధి కోల్పోతున్నారు. తెలుగింటి లోగిళ్లలో ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ జలపుష్పాలు కాలక్రమేణ కనుమరుగు అవుతుండటం మాంసాహారులను తీవ్ర నిరాశ పర్చుతుంది. అందులో ఇదే పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే కాలువ చేపల్లోని కొన్ని జాతులు పూర్తిగా అంతరించిపోతాయని, భావితరాలకు చరిత్రలోని అంశాలుగా మిగిలిపోయే ప్రమాదముందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. సాధారణ సమయంలోను చేపల లభ్యత ఉండటం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంప్రదాయ వంటకాల రుచే వేరు

బొమ్మిడాయిలు..., కొర్రమేనులు..., చితికి చేపలు మన సంప్రదాయ చేపలు. ఇవి బురద, జలాశయాల అడుగు భాగంలో జీవిస్తాయి. పంట కాలువలు, బోదెల్లో ఎక్కువగా మట్టగిడసలు, జెల్ల కొంకులు, బొచ్చులు, బొమ్మిడాయిలు, యర్రమేను, ఉల్లింకలు తదితర కాలువ చేపలు పంట కాలువలు మూసివేసిన తరువాత మత్స్యకారులకు ఒకప్పుడు అధికంగా లభించేవి. రుచిలో మేటి అయిన ఈ చేపలు లభ్యం కాకపోవడంతో మాంసాహార ప్రియులకు ఆందోళన కలిగిస్తుంది. కొన్ని జాతుల చేపలు గౌతమీ గోదావరి పరీవాహక ప్రాంతంలో లభ్యమవుతున్నా కాలువ చేపలకున్నంత రుచి మాత్రం ఉండదనేది మాంసాహారుల అభిప్రాయంగా ఉంది. అలాగే కొంతమంది రైతులు కొరమేను, బొమ్మిడాయిలు వంటి చేపలను చెరువుల్లో పెంచుతున్నా గతంలో కాలువ చేపలకు ఉన్న డిమాండ్ మాత్రం ఉండటం లేదు.


కాలువల్లోని చిన్న (చితికి) చేపలు


బొమ్మిడాయిలు

అంతరించిపోవడానికి కారణం!

పంట పొలాల్లో వినియోగిస్తున్న ఎరువులు, క్రిమి సంహారక మందులు, పొలాల్లో సమీపంలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల ప్రభావం, వల్ల కాలువల్లో పడేసే వ్యర్థాల వల్ల వివిధ జాతి చేపలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఆయా రకాల కాలుష్యం నీటి జలాశయాల్లో చేరి అడుగు భాగాన నివసించే చేపలపై దుష్ప్రభావాన్ని చూపుతుంది. పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంలోని అల్యూమినియం హైడ్రాక్సైడ్, రసాయన ఎరువుల్లో ఉండే అమ్మోనియా, క్రిమి సంహారక మందులు నీటి అడుగు భాగంలో చేరి నిల్వ ఉండిపోతుండటం వల్ల అక్కడ ఉన్న ఆక్సిజన్‌ను హరించివేస్తున్నాయి. దీనివల్ల విలువైన మత్స్య సంపదను కోల్పోవలసి వస్తుంది.

మత్స్యశాఖ ప్రత్యేక శ్రద్ధ వహించాలి

తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువల్లో నానాటికి అంతరించిపోతున్న కాలువ చేపలను సంరక్షించేందుకు మత్స్యశాఖ ప్రత్యేక శ్రద్ధ వహించాలనే డిమాండ్ అంతటా వ్యక్తమవుతుంది. మత్స్యశాఖలో అంతర్భాగంగా పనిచేసే పరిశోధన విభాగాలు చేప జాతి అభివృద్ధిపై దృష్టి సారిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని మత్స్యకార నిపుణులు చెబుతున్నారు. దీనిపై ద్వారపూడి మత్స్యశాఖ అధికారులను వివరణ కోరగా కాలువల్లో పేరుకుపోతున్న కాలుష్యం వల్ల కనుమరుగవుతున్న కాలువ చేపలను ప్రత్యేక ఫామ్‌ల ద్వారా పిల్లలను ఉత్పత్తి చేసి చెరువుల్లో పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వారు వివరించారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం


దాత భువనేశ్వరి దేవికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ప్రధానార్చకుడు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాకినాడకుకు చెందిన కొంగరపు సింహాచలం-పద్మావతి దంపతులు రూ.10,116, రాజమహేంద్రవరానికి చెందిన చెల్లూరి భువనేశ్వరి దేవి రూ.10 వేలు విరాళం సమర్పించారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతలను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతలను ఆలయ సిబ్బంది అభినందించారు.

కళాకారుడికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న కళాకారుడు సత్యనారాయణ

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన ప్రముఖ బుర్రకథ కళాకారుడు మంగం సత్యనారాయణ గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. హైదరాబాదులోని డాక్టర్ ఎన్టీ రామారావు కళా మందిర్‌లో గురువారం జరిగిన సమావేశంలో శ్రీపొట్టి శ్రీరాములు యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మక డాక్టరేట్ అవార్డుతో సత్యనారాయణను సన్మానించింది. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్న సత్యనారాయణను శుక్రవారం నగరంలో పలువురు అభినందించారు. అతడికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

అంబాజీపేట: ఎస్సీ కార్పొరేషన్ కార్యాచరణ ప్రణాళిక 2024-25 సంవత్సరానికి మండల పరిషత్ ద్వారా అందించే రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ఓబీఎంఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21 నుంచి 50 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. మే 10 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డుకు లింకైన ఫోన్ నంబర్, రేషన్ కార్డు, కులం, ఆదాయ ధ్రువపత్రం, రవాణాకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు, ఆధార్, రేషన్ కార్డులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు.

కైలాసభూమికి రూ.లక్ష విరాళం


చింతం విజయకృష్ణమోహన్

కొత్తపేట: స్థానిక లయన్స్ క్లబ్ కైలాస భూమికి మందపల్లి మాజీ సర్పంచ్, ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారి దేవస్థానం మాజీ చైర్మన్ చింతం విజయకృష్ణమోహన్ రూ.లక్ష విరాళం సమర్పించారు. శుక్రవారం మందపల్లిలో సీసీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ గంటి హరీష్‌మాథుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా లయన్స్ క్లబ్ సభ్యుడు, కైలాసభూమి నిర్మాణ పర్యవేక్షకుడు కంఠంశెట్టి శ్రీనివాసరావుకు అందచేశారు. చింతం కృష్ణను వారు అభినందించారు.

ఉచిత కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభం


ఆలమూరులో కుట్టుమెషీన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు: మండలంలోని ఆలమూరు, చొప్పెల్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మెషీన్ శిక్షణ కేంద్రాలను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఎంపీడీఓ ఎ.రాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే బండారు పాల్గొని ప్రసంగించారు, తొలివిడతలో 250 మందికి ఈశిక్షణ తరగతులను 40 రోజుల పాటు నిర్వహించనున్నారన్నారు. ఆలమూరులోని స్త్రీశక్తి భవనంలో 125 మందికి, చొప్పెల్లలోని ఆర్బీకేలో 125 మందికి ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల వారీగా అనుభవజ్ఞులైన మహిళలతో ఈ శిక్షణ ఇవ్వనున్నామన్నారు. బీసీ, ఈబీసీ కార్పొరేషన్ పర్యవేక్షణలో జరిగే ఈ శిక్షణను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కూటమి నాయకులు మెర్ల గోపాలస్వామి, నాగిరెడ్డి స్వామి, దంగేటి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూత


అప్పనపల్లిలో తాగునీటి ప్లాంటును పరిశీలిస్తున్న ఈఈ శంతనుదాస్

మామిడికుదురు: సామాజిక సేవా కార్యక్రమాలకు ఓఎన్జీసీ ఇతోధికంగా చేయూత నందిస్తోందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంతనుదాస్ తెలిపారు. ఆయన కుటుంబ సమేతంగా శుక్రవారం అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) రామారావుతో కలసి స్వామి వారిని దర్శించుకుని అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఈఈకి నూతన వస్త్రాలు, స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. ఓఎన్జీసీ నిధులు రూ.5 లక్షలతో ఆలయ ప్రాంగణంలో నిర్మించిన వాటర్ ప్లాంటును ఈడీ పరిశీలించారు. దాని పనితీరును అడిగి తెలుసుకున్నారు. దీన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట స్థానిక ఓఎన్జీసీ అధికారులు, ఆలయ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

పనిచేసే ప్రతి ఒక్కరికీ పదవులు


కోఆర్డినేటర్ శ్రీనివాసరావును మర్యాదగా కలసిన యువజన విభాగం అధ్యక్షుడు వెంకటరమణ

అయినవిల్లి: పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ప్రతి ఒక్కరికీ పదవులు వస్తాయని పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం నూతనంగా ఎన్నికైన అయినవిల్లి మండల యువజన విభాగం అధ్యక్షుడిగా కుసుమ వెంకటరమణ, అంబాజీపేట మండల యువజన విభాగం అధ్యక్షుడిగా సుధాబత్తుల రామారావు (రాము), మామిడికుదురు మండల యువజన విభాగం అధ్యక్షుడిగా మట్టపర్తి శివన్నారాయణలు కోఆర్డినేటర్ శ్రీనివాసరావును అయినవిల్లి మండలంలోని తొత్తరమూడిలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తాము పార్టీ పూర్వ వైభవానికి తమ వంతు కృషి చేస్తామని వీరూ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావుకు హామీ ఇచ్చారు. వీరిని కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పలువురు పార్టీ నాయకులు అభినందించారు.

జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాల నివారణ


పెట్రోల్ బంకులో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కొత్తపేట: ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో వ్యవహరిస్తూ జాగ్రత్తలు పాటించడం ద్వారా అగ్నిప్రమాదాలు నివారించవచ్చని స్థానిక అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద అగ్ని ప్రమాదాలు-నివారణ గురించి సంస్థ సిబ్బందికి, వినియోగదారులకు అవగాహన కల్పించారు. ప్రయోగాత్మకంగా ప్రమాదాలను నివారించే చర్యలను ప్రదర్శించారు. సిబ్బంది, వినియోగదారులు నియమ నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పెట్రోల్ బంకు మునేజర్ విన్నకోట రాఘవేంద్రరావు, ఫైర్ సిబ్బంది, బంకు సిబ్బంది, పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు కందుకూరి


కందుకూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అరసం, జేవీవీ సభ్యులు

రావులపాలెం: గ్రంథాలయ పునర్వికాసానికి పాటుపడాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో శుక్రవారం (అరసం), జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో కందుకూరి జయంతిని నిర్వహించారు. తొలుత జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్యాట్రాన్ డాక్టర్ చల్లా రవికుమార్ పర్యవేక్షణలో అరసం సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు గండి స్వామి ప్రసాద్ అధ్యక్షతన 'వీరేశలింగమొకడు మిగిలెను చాలును' అనే కవితాంశంపై కవి నీరాజనం నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన కవులు కందుకూరి కృషి పై కవితలు వినిపించారు. కవితలు వినిపించిన కవులకు ప్రశంసా పత్రాలను ప్రముఖులు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పి.లింగేశ్వరరెడ్డి, అరసం, జేవీవీ నాయకులు, కవులు, సాహితీ వేత్తలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భావజాలమే స్ఫూర్తి


అంబాజీపేటలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి స్టాలిన్‌బాబు

అంబాజీపేట: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలం, ఆలోచన విధానాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని విజయవాడ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మోకా సత్తిబాబు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మాజీ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు అన్నారు. అంబాజీపేట జయంతి నగర్‌లో నేలపూడి సూరన్న బ్రదర్స్, కుటుంబ సభ్యులు, జయంతినగర్ సేవా సంఘం, యువసేన సహకారంతో హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారితో అంబేడ్కర్ ఆశయం, లక్ష్యాలపై కళారూపం సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శనను శుక్రవారం రాత్రి నిర్వహించారు. వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు స్వేచ్ఛా సమానత్వానికి విశేష కృషి చేసిన అంబేడ్కర్ నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత అన్నారు. నేటి యువత అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. అంతకుముందు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మైలా ఆనందరావు, చింతా రాజేంద్రప్రసాద్, కత్తుల బాబులు, గోసంగి సత్యనారాయణ, సాధనాల బాలకృష్ణ, నేలపూడి గిరి, పాలమూరి వెంకట్, కోట సత్తిబాబు, కోట హనుమంతరావు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ నిరసన


తాటిపాక పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌ఓలు

రాజోలు: పీహెచ్‌సీల్లో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్‌ఓ)లు రాష్ట్ర కమిటీ పిలుపు దశలవారీగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా తాటిపాక, రాజోలు పీహెచ్‌సీల వద్ద ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన వ్యక్తం చేశారు. సీహెచ్‌ఓలను సత్వరమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య కేంద్రాల అద్దె, విద్యుత్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. 23 శాతం జీవనభృతి కల్పించాలని, బదిలీలకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి ఫణికిరణ్‌కు అందజేశారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం పంచాయతీ పరిధిలోని ప్రసాద్‌నగర్ కాలనీ, గుడాల వారిపాలెంలో తరచూ లోవోల్టేజ్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తక్షణమే ఆ సమస్యను పరిష్కరించాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు. రాత్రి సమయంలో లో వోల్టేజీ కారణంగా విద్యుత్ దీపాలు, ఫ్యానులు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

క్రీస్తు త్యాగాన్ని స్మరించుకోవాలి

- ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు


రావులపాలెంలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని సన్మానిస్తున్న చర్చి నిర్వాహకుడు

రావులపాలెం: ప్రజల కోసం ఏసుక్రీస్తు చేసిన త్యాగాన్ని అందరం స్మరించుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. పవిత్ర గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం స్థానిక బేతెస్థ ప్రార్థనా మందిరంలోని కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు చేసిన గొప్ప త్యాగాన్ని స్మరించుకున్నారు. త్యాగం, క్షమ, ప్రేమ అనే విలువలను మన జీవితంలో అమలు పరచుకుందామన్నారు. బేతెస్థ చర్చి నిర్వాహకులు జగ్గిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆలమూరు: విశ్వశాంతి కోసం ప్రభువైన క్రీస్తు త్యాగానికి ప్రతీకగా నిలిచిన గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని మత ప్రార్థనాలయాల్లో క్రైస్తవులు ఉపవాసంతో ఉండి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంక ఆర్సీఎం చర్చి నిర్వాహకుల ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. ఫాదర్ ఆధ్వర్యంలో క్రీస్తుకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సఖినేటిపల్లి: జీసస్ మహాత్యాగానికి గుర్తు గుడ్‌ఫ్రైడే అని అంతర్వేది ఇండియన్ పెంతుకోస్తు చర్చి పాస్టర్ ఎం.సిరిల్ అన్నారు. చర్చిలో గుడ్ ఫ్రైడే పురస్కరించుకుని ఆయన ఆధ్వర్యంలో ఏమివ్వగలము, నీ ప్రేమకై యేసయ్యా అంటూ చిన్నారులు, మహిళలు గీతాలాపనలు చేశారు.

రాజోలు: గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని బి.సావరం రోమన్ కేథలిక్ చర్చిలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ కె.జోసఫ్ ఆధ్వర్యంలో పొలగుమ్మి నాలుగు రోడ్ల కూడలి నుంచి బి.సావరం శోభనా స్కూల్ వరకు భారీ సిలువ కార్యక్రమం జరిగింది.

మామిడికుదురు: గుడ్‌ఫ్రైడే ప్రార్థనలను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దీనిలో భాగంగా పలు ప్రాంతాల్లో సిలువను ఊరేగించారు. ఏసుక్రీస్తును ఆరాధిస్తూ పాటలు పాడారు. అప్పనపల్లి చర్చి నుంచి ప్రారంభమైన సిలువ ఊరేగింపు పెదపట్నం, నగరం, తాటిపాక మీదుగా మామిడికుదురు వరకు జరిగింది.

కొత్తపేట: ఈ లోకంలో మానవాళి రక్షణ కోసమే ఏసుక్రీస్తు తన ప్రాణాన్ని సిలువపై బలిగా అర్పించారని స్థానిక ప్రవచన దేవుని సంఘం యెరూషలెం చర్చి పాస్టర్ బిషప్ జి.అబెద్నగో అన్నారు. గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

అంబాజీపేట: క్రీస్తు మానవాళి పాప విముక్తి కోసం సిలువపై బలియాగం చేశారని అంబాజీపేట కల్వరి క్రైస్తవ ప్రార్థన మందిరం నిర్వాహకుడు ఫాదర్ జార్జి పాపఫ్, ఇరుసుమండ సెయింట్ జోసఫ్ చర్చి ఫాదర్ వినయ్‌సాగర్ అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా స్థానిక కల్వరి క్రైస్తవ మందిరం, ఇరుసుమండ, అంబాజీపేట చర్చిల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండుటెండలో సిలువపై వేలాడుతూ క్రీస్తు పలికిన ఏడు మాటలు మానవాళికి ఆశీర్వాదంగా ఉన్నాయన్నారు.


సంగీత్ గీసిన క్రీస్తు సిలువ చిత్రం

ఆకట్టుకున్న గుడ్‌ఫ్రైడే చిత్రం

మలికిపురం: గుడ్‌ఫ్రైడే సందర్భంగా మలికిపురానికి చెందిన సునయన ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ నల్లి సంగీత్ గీసిన చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

జగ్గిరెడ్డిని కలసిన శ్రీకాంత్


జగ్గిరెడ్డిని అభినందిస్తున్న శ్రీకాంత్ తదితరులు

రావులపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నియమితులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనను శుక్రవారం అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పినిపే శ్రీకాంత్, అలాగే అమలాపురం నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గోపాలపురంలోని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వగృహానికి చేరుకుని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

జగ్గిరెడ్డిని కలసిన కేఎస్ఎన్ రాజు

మలికిపురం: జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా నియమితులైన చిర్ల జగ్గిరెడ్డిని రాజోలు నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు కెఎస్ఎన్ రాజు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గోపాలపురంలో జగ్గిరెడ్డి నివాసంలో ఈ మేరకు కలసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట నాయకులు కంచర్ల శేఖర్, ముప్పర్తి త్రిమూర్తులు, కానూరి బాబి, వెళ్ళా చక్రి, తదితరులు ఉన్నారు.

అంతర్వేదిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలి


అంతర్వేదిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు వినతి పత్రం ఇస్తున్న నాగేశ్వరరావు

మలికిపురం: అంతర్వేదిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కొబ్బరి దింపు, ఒలుపు కార్మిక సంఘం అధ్యక్షులు బొడ్డపల్లి నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. విశ్వేశ్వరాయపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు కలిశారు. అంతర్వేదిలో విశాలమైన భూములు ఉన్నాయన్నారు. అలాగే అంతర్వేదిలో ప్రతిపాదనలో ఉన్న డ్రెడ్జింగ్ హార్బర్ నిర్మాణం చేపట్టాలని కూడా కోరారు. ఫలితంగా ఇక్కడ ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

ఘన జీవామృతంతో తెగుళ్లు దూరం


ఘన జీవామృతం తయారు విధానం వివరిస్తున్న ప్రసన్నకుమార్

రాజోలు: ఘన జీవామృతంతో పంటలను ఆశించే తెగుళ్లు దూరమవుతాయని ప్రకృతి వ్యవసాయ తాటిపాక యూనిట్ ఇన్‌చార్జ్ పోతురాజు ప్రసన్నకుమార్ అన్నారు. శుక్రవారం తాటిపాకలో మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఘన జీవామృతం తయారు చేసే విధానాన్ని వివరించారు. 500 కేజీల దేశీయ ఆవుపేడ, 20 కేజీల ఆవు మూత్రం, 10 కేజీల శెనగపిండి, 10 కేజీల బెల్లం తీసుకుని వీటన్నిటిని కలియబెట్టి ఒక గోనె సంచిని వారం రోజుల పాటు గాలి తగలకుండా కప్పి ఉంచాలన్నారు. అలా తయారు చేసుకున్న ఘన జీవామృతాన్ని ఎరువుగా వినియోగించుకోవచ్చన్నారు.

అభివృద్ధి పథకాలకు శ్రీకారం

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో పలు అభివృద్ధి పథకాలను ఎంపీ గంటి హరీశ్ మాథుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావులు శుక్రవారం ప్రారంభించారు. గ్రామ ప్రజల తాగునీటి సరఫరాల కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైన 89.80 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని వారు ప్రారంభించారు. రూ.15 లక్షల అంచనాతో నిర్మించిన ఘన, ద్రవ, వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీ హరీష్, ఎమ్మెల్యే సత్యానందరావులను గ్రామస్తులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అలాగే ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికై రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలో అవార్డు అందుకున్న సర్పంచ్ త్సామా బాబును వారు సన్మానించారు. మందపల్లి గ్రామంలో ఎంపీ నిధులు రూ.30 లక్షలతో నిర్మించే ఏటిగట్టుపై సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఎంపీటీసీ సిద్దంశెట్టి వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.